# కొత్తచావు

మీ పెల్లాలకు చేయించుకోండి టెస్టులు. మా వొక్కల్లదగ్గర్నే పంటున్నరా మగోళ్లు? యిండ్లల్లకుబోయి పెల్లాలతోని పంటలేరా మేమే వాల్లకంటిస్తమని యేంది వాల్లే మాకు

అంటిస్తున్నరేమో. మీరంతా మా దగ్గరికి వస్తున్నప్పుడు మీ పెళ్లాలు యేం జేస్తున్నరో మీకు తెలుసునా? వాళ్లెవరి దగ్గరా పంటలేరా? సొక్కంగున్నరా? మిండగాల్లు లేరా? మాకే యెందుకు టెస్టులు? మీరు చేయించుకోండి. మీ పెళ్లాలకు తల్లులకు చెల్లెల్లకు చేయించండి. పురుగులు రాల్తయి వొక్కొక్కదానికి.

వారం రోజుల నాడు రామలక్ష్మి అరచిన అరుపులు యింకా చెవుల్లోనే వున్నాయి. కానీ యిందాకేమంది రామలక్ష్మి? వెళ్లిపొమ్మందా చచ్చిపొమ్మందా బతికిపొమ్మందా... యేమంది రామలక్ష్మి.

పెచ్చులూడిన గోడకు చేరగిలబడి కూర్చున్నప్పుడు. తమ మోకాళ్లు రెండూ గడ్డానికి ఆన్చినప్పుడు, యేమంత వెకిలిగాలేని యీ లేత నీలం రంగు చీరలో తానిలా జుట్టు విరబోసుకుని వున్నప్పుడు మునిరత్నానికి తాను చాలా అందంగా కనిపిస్తాను. అందంగా కనిపించడం అంటే రత్నానికి కొరుక్కుతినాలనిపించడం. చాలా యెక్కువగా తనదగ్గరికి వచ్చేవాళ్లలో వొకడు రత్నం. అతనికి తనమీద పెద్దగా ప్రేమ లేదు కానీ తన వొళ్లంటే మాత్రం అతనికి పిచ్చి కోరిక. తానెలా వున్నా, జ్వరంలో వున్నా కోపంలో వున్నా యేడుస్తున్నా మంచి చీర కట్టినా కట్టకపోయినా జడవేసినా ఆరబోసినా యెలా వున్నా అతనికి మాత్రం బలే కోరిక కలుగుతుంది. వొకే వూరి దాన్నని అతనికి తనంటే స్పెషల్ యిష్టమట. రత్నానికి తన గురించి తెలిస్తే యేమనుకుంటాడు? యింకా అతనికి తన శరీరం మీద కోరిక కలుగుతుందా?

అదేమిటి? తను రత్నం గురించి ఆలోచిస్తోంది? జీవితం తనను తినేయకముందు తనంటే యిష్టపడీ పడిచచ్చిన సుబ్రమణ్యం గురించో తనను యీ రొచ్చులోనే చూసి కూడా పెళ్లి చేసుకుంటాను రమ్మని కోరి పోరాడిన అన్వర్ కానీ యెందుకు గుర్తుకురావడం లేదు? వాళ్లంతా తనను తనుగా యిష్టపడ్డవాళ్లు. కానీ యిప్పుడు సమస్య శరీరానికి కదా? యీ శరీరానికి యే మాత్రమన్నా విలువ వుంటుందా. బజారులో నిలబెడితే యెవరన్నా దీనివైపు ఆసక్తిగా చూస్తారా... అసలు యేమైంది తనకు?

వొక అయోమయంలో వున్నట్టుంది. తప్పనిసరి వెగటును భరిస్తున్నట్టు వుంది. వాంతి చేసుకున్న నోటిని నోట్లో పెట్టినట్టు... యేం జరుగుతోందో తెలియదు, తన గురించి తనకేదో కొత్తగా తెలిసినట్టు..

మరణశిక్ష పడ్డట్టుంది. యీ బొంది పరాధీనం అయ్యాక యికదాని మీద యేం గౌరవం వుంటుంది? కాళ్లూ చేతులూ కదిలించడానికి కూడా కుదరనట్టు.

తనది కాదు మరెవరిదో యీ శరీరం అన్నట్టు యెంత పరాయిగా వుందో. యిప్పుడెవరన్నా వచ్చి బేరం కుదుర్చుకుంటే అలాగే యింతే నిర్వికారంగా...

రామలక్ష్మి యిందాక యేమన్నది? యేమన్నది యేమన్నది? ఆ లంజాకొడుకులు ఆరోజు టెస్టులు జేస్తమని నెత్తురు తీసుకుంటుంటె తిట్టిన గానీ యియ్యనే యిస్తిమి. యిప్పుడొచ్చి వాడంటడూ యిద్దరికి వున్నదంట పెద్దరోగం, నీకు సరస్వతికి. యే రోగమున్నా నాకయితే యేం లేదమ్మా కనీ పోలీసోళ్లకి తెలిసిపాయె. డాక్టర్లకు తెలిసిపోయె. పోలీసోళ్లకు తెలిసిపోతె యీడికొచ్చే అందరికీ తెలిసినట్టేనాయె. నీ అంత చక్కందాన్ని యిడిశిపెట్టుడు నాకసలు యిష్టంలేదు కనీ యేం జేస్త. దందా కరాబయితది. యెక్కడికి పోతున్నవో గూడ జెప్పకుండవో. సొంతంగ దంద జేసుకో. యెవడన్న పరీక్ష జేస్త నెత్తురియ్యి అన్నడో వాన్ని శెప్పుదీసుక్కొట్టు. నీకు ఆ రోగమున్నదోలేదో ఆ దేవున్కి యెర్కగానీ వుంటే గన్క లోకంల మగోడన్నోడిని యిడవకుండ అంటియ్యి. సావనీ లంజకొడుకుల్ని, సావనీ బాడుకావుల్ని...

యిందాక రామలక్ష్మి యేం చెప్పింది? పొమ్మంటుంది కదా! కరెంటు పనిచేసే అన్వర్ ఆరు నెలల కిందట పెళ్లి చేసుకుంటాను వదిలేయి అంటే యెంత గొడవచేసింది? మనుషులను పెట్టి అన్వర్ని కొట్టించింది. పారిపోతే వెనక్కి రప్పించింది. వెయ్యిరూపాయలిచ్చి కొన్నానే లంజా యెక్కడికి పోతావే అని తిట్టింది. యిప్పుడేమిటి కట్లు తెంచేస్తోంది? యిందాక రామలక్ష్మి యేం చెప్పింది? వెళ్లిపోయి సొంతంగా దందా పెట్టుకోమని కదా? యిందాక రామలక్ష్మి యేం చెప్పింది? నాకు యేదో పెద్దరోగమొచ్చిందని కదా

మరకల మరకల పరుపు మీద అట్టలు కట్టి గట్టి పడ్డ పరుపు మీద వొళ్లు వాలిస్తే, గదినిండా గాలిచొరని వాసన కమ్ముకుంటే వొకటి రెండురోజుల పాత సెంటు వాసన వెగటును రెట్టింపు చేస్తుంటే లేని జీవితం ముగియబోతోందని, లేని ప్రాణం కొడిగట్టబోతోందని తెలిసి.

వుండడం లేకపోవడం అంటే యేమిటి? తను చచ్చిపోతే యెవరికి మాత్రం నష్టం? యెలాగూ వొక వయసులో యెవరికీ అక్కరలేక చావాల్సిందే కదా. కాదుకాదు యిప్పుడొచ్చిన సమస్య తనో పిచ్చికుక్క. కరిస్తే అందరికీ పిచ్చి యెక్కుతుంది తనతో పడుకుంటే అందరికీ జబ్బు సోకుతుంది. తనొక వ్యక్తి కాదు- మహాశక్తి. తలచుకుంటే తను మానవజాతికే నిప్పుపెట్టేయగలదు.

చచ్చిపోదామా సరస్వతీ. వాళ్లు మనల్ని చంపుతూ బతికిపోతున్నప్పుడు

సహించి క్షమించామే! యిప్పుడు వారికి ప్రాణభయం తగ్గించడానికి మనం చచ్చిపోదామా.

వారం కింద రక్తం తీసుకోవడానికి వాళ్లు వచ్చినప్పుడు తనూ సరస్వతీ చాలాచాలా మాట్లాడుకున్నారు. వాళ్లెందుకు వచ్చారో యే జబ్బును వెదుక్కుంటూ వచ్చారో సరస్వతే తనకు చెప్పింది. సరస్వతికి తన కంటే లోకం చాలా తెలుసు. ఆ జబ్బు మనకుందంటావా అని తను అడిగింది, వుందేమో లేదేమో కూడా అని జవాబు చెప్పింది. మన దగ్గరికి వచ్చే వాళ్లలో యెవరికి వుందో యెవరికి లేదో మనకేం తెలుసు? మనమేమి డాక్టర్ సర్టిఫికేట్లు అడుగుతున్నామా అని యెదురు ప్రశ్న వేసింది. వుందనుకో. వుంటే యేంటట? అంది. ఆ జబ్బుకు మందులేదట కదా అని అడిగింది తను. యెన్ని జబ్బులకు మందుంది అని అడిగింది సరస్వతి. మీ అమ్మానాన్న దగ్గరినుంచి తీసుకువచ్చి యిక్కడ అమ్మేశాడే మీమామయ్య వాడికి యే జబ్బూ లేదా? మీ మామయ్యను నమ్మి పట్నంలో పనికి పెడతానంటే పంపించారే మీ అమ్మా అయ్యా వాళ్లకి లేదా జబ్బు అని అడిగింది. మందుల్లేని జబ్బులు యెన్ని వున్నాయో తెలుసునా అని అడిగింది, అడిగి అడిగి సరస్వతి పొగిలి పొగిలి యేడ్చింది. నా తమ్ముడు పదేళ్ల వాడు విరేచనాలతో చచ్చిపోయాడు తెలుసా అని అడిగింది. మా అమ్మ ఆఖరి కాన్పులో ఆరేళ్ల కిందట చచ్చిపోయింది తెలుసా అని అడిగింది. మా అన్నయ్యను పోలీసులు కాల్చేసారు తెలుసా అని అడిగింది. ఆకలి జబ్బుకి మందులేదు తెలుసా అని అడిగింది. మందుల్లేని రోగాలు పేదవాళ్లకు యెన్ని వుంటాయో తెలుసా అని అడిగింది. మొగుడు యే రాత్రి నిద్రలో కిరోసిన్ పోసి తగలబెడతాడో అని భయంతో యేడాది పాటు కాపరం చేసాను తెలుసా అని అడిగింది. కొత్తగా మన జీవితంలో శరీరంలో యేం కనిపెట్టి భయపెట్టగలరే అని అడిగింది. సరస్వతి చాలా తెలివైన పిల్ల. పాతికేళ్లు నిండకుండానే జీవితాన్ని అటునించి యిటు తిరగేసిన పిల్ల. చాలా తెలివిగా మాట్లాడుతుంది, దాని దగ్గరికి వచ్చే మగవాళ్లను నానామాటలూ అంటుంది, దాని చేత అనిపించుకోవడానికే వస్తారు దాని దగ్గరకి.

వారం రోజుల కింద సరస్వతి యేమంది? యీ రోగం నాకొచ్చినా భయంలేదే అన్నది. యిదొచ్చిందని తన శరీరాన్ని వొదిలిపెడితే చాలంది. నమిలి తినడానికి, పీల్చి పిప్పి చేయడానికి కూడా పనికిరాని శరీరాన్ని రాళ్లతో కొట్టి చంపుతారే. మన వొళ్లే కదే మన వునికి. దాన్నిండా విషం వుందని తెలిసాక మనల్ని అంటుకుంటే చావుకి దగ్గరవుతామని తెలిసాక మన దగ్గరకు యెవరూ రారే. మనల్ని పిచ్చి

కుక్కల్ని వేటాడి చంపినట్టు చంపుతారే అని దిగులుగా అన్నప్పుడు సరస్వతి యేమన్నది? చంపనివ్వవే, చద్దాము. యెంతకాలమే యీ మెరుపు చీరలుకట్టి పౌడర్లు రుద్దీ వొక తినుబండారంలాగా తిరుగుదాము అన్నది.

చావడమంటే యేమిటో యిప్పటికీ తెలియడం లేదు. యెప్పుడో వస్తుందట చావు. పదేళ్లకో పదిహేనేళ్లకో. యీలోగా తనతో కలిస్తే అందరికి యీ జబ్బు పాకిపోతుందట. చావు ఖరారయిన జబ్బు. నీళ్ల తాగితేనో, కల్తీ తిండి తింటేనో వచ్చిన జబ్బు కాదు. యెవరో మగవాడి వీర్యం నుంచి సోకిన జబ్బు. జననాంగంలో నిల్వ చేసుకున్న జబ్బు. మన మీదుగా వీచే గాలి విషం అవుతుంది. మనల్ని కలిసే శరీరం విషపూరితమవుతుంది, యముడు మన మీదుగా యమపాశాల్ని విసురుతుంటాడు. మనమిక మనుషులం కాము, తేళ్లం... పాములం... పేడపురుగులం... కొట్టికొట్టి చంపాల్సిన పాములం... పిచ్చికుక్కలం... దారిన పోయే ప్రతి వొక్కడూ రాయి విసరగలిగే నేరస్థులం.

సరస్వతీ సరస్వతీ నువ్వేం చేస్తావే... యెట్లా భరిస్తున్నావు దీన్నంతా.. కొత్తగా మనకేం అయిందని యీ బాధ అంటావేమో నువ్వు. నీకేం జీవితంలో అన్ని లోతులూ తెలిసినదానివి. చావడానికి యెప్పటినుంచో సర్వసన్నద్ధంగా వున్నదానివి బతుకుకూ చావుకూ మధ్య సన్నటి సరిహద్దుల్లో సంచరిస్తున్నదానివి. నాకు చావాలని లేదే సరస్వతీ, నాకు బతకాలని వుంది. యిలాగే యింత రొచ్చులోనయినా నాకు బతకాలనే వున్నది. రోజుకొకడికి యిద్దరికి ముగ్గురికి వొళ్లు అప్పగిస్తూ యిలాగే గడిపేయాలని వున్నది కానీ చచ్చిపోవాలని లేదు. సుబ్రమణ్యం నుంచి దూరం అయినా అన్వర్ ఆశను చంపుకున్నా నామీద నా ఆశను మాత్రం చంపుకోలేకపోయాను. యెప్పటికో వొకప్పటికి అందాల రాజు వస్తాడు మందారమాల వేస్తాడు అన్న కలను చిదుముకోలేనే సరస్వతీ.

యేమ్నది రామలక్ష్మి? పెట్టె సర్దుకోవే అన్నది. యెక్కడికి పోయేది తనకు కూడా చెప్పకన్నది... యీ రాత్రి గడిస్తే యములాళ్లు వొచ్చి పట్టుకుపోతారు జాగ్రత్త అన్నది. జైల్లో వేస్తారో బందెల దొడ్లో వేస్తారో తెలియదన్నది. బతుకంతా యీ రోగం పేరు చెప్పుకుంటూ బతకాలి అని బెదిరించింది. సరస్వతి అప్పుడేమన్నది? యెందుకు యెందుకు మమ్మల్ని జయిల్లో వేస్తారు? మాదగ్గరికి వచ్చే మగోళ్లను యెందుకు వేయరు అని అడిగింది. యీ సందులోకి వచ్చే ప్రతి మగోడినీ కాళ్లూ చేతులూ కట్టేసి యెందుకు పరీక్ష చేయరు అని అడిగింది. నన్నడిగితే నేనేం చెబుతానే? ఆ కోర్టుని అడుగు. ఆ పోలీసోణ్నడుగు. నెలకోసారి

వచ్చి నిరోధులు గుమ్మరించి వెళ్లే మేడమ్‌లని అడుగు అన్నది. రామలక్ష్మి. మీరు మాత్రం యిక్కడుండొద్దు యెక్కడికన్నాపోయి బతకండి అన్నది.

పెట్టె సర్దుకుంటుంటే నిరోధ్ ప్యాకెట్లు వెక్కిరిస్తాయి. దేన్ని నిరోధిస్తారే మీరు? యెప్పుడూ విప్పని ప్యాకెట్లు రోగాల్నీ కడుపుల్నీ కాదు చావుల్ని కూడా ఆపలేవు. మేడమ్‌లూ మేడమ్‌లూ మీ మగవాళ్లకు తొడిగించగలరా వీటిని? యెప్పుడూ యెవరినీ యే ప్రశ్నా అడగలేము. పెట్టె సర్దుకున్నాం కానీ యెక్కడికి పోతాం? మదనపల్లికి పోదామా? అమ్మా అయ్యా దగ్గరికి పోదామా? తెలిసినచోటికి పోకు. నువ్వెక్కడున్నా వొస్తారు యముళ్లు. అమ్మా నాయినలకు తెలిస్తే నువ్వు మళ్లీ వచ్చినందుకు యెత్తి యేడు దోసిళ్ల మన్ను పోస్తరు. పోకు పోకు బిడ్డా యింకెక్కడికన్నా పో. రామలక్ష్మికి. అమ్మానాన్నల మీద అంత ప్రేమ యెప్పటినుంచో? సరస్వతి అంటుందీ మెడలో బోర్డు తగిలించుకుని అర్ధరాత్రి రోడ్డ మీదికి పరిగెత్తుదాము పదవే... యెవ్వడూ మన జోలికి రాడు. అప్పుడు యేదన్నా గాంధీ బొమ్మ దగ్గరికి వెళ్లి అర్ధరాత్రి మేం స్వేచ్ఛగా తిరిగేస్తున్నాము. స్వాతంత్ర్యం వచ్చిందహో అని అరుద్దాము అంటుంది. దాని మాటలు యెప్పుడూ అర్థం కావు.

యీ యిరుకిరుకు గది నుంచి వెళ్లి పోతుంటే యీ కుక్కి అయిపోయిన ప్లాస్టిక్ నవారు మంచానికి వీడ్కోలు చెబుతుంటే, వెగటు కోరికల ముక్కి వాసన నుంచి వెళ్లిపోతుంటే కూడా దిగులుగానే వుంది. యీ వేశ్యా వాడనంతా వంట్లోకి యింకించుకుని వెళ్లపోతున్నట్టు వుంది. మగవాళ్లనందరి పాపపు బరువునీ యినప బకెట్‌లో వొక్కదాన్నే తలమీద మోసుకుని పోతున్నట్టుంది. యీ శరీరాన్ని యెక్కడన్నా వొదిలేసి పోగలిగితే బావుండును అని వుంది. సరస్వతి తయారయిందా? అదే నాకు తోడు. దానికి బోలెడు ధయిర్యం. యింత ధయిర్యం యెక్కడిదే నీకు అంటే బతుకులో యెన్ని చావులు చూస్తే అంత ధయిర్యం వస్తుందంటుంది. ఆడతనమే మందుల్లేని పెద్దరోగం. యిక మనకు యేం భయమే అంటుంది.

పక్క సీటులో నిద్ర పోతోంది సరస్వతి. దానికి యీ విషయాల గురించి మాట్లాడాలని లేదు. మనకేమి జరగలేదు. యేదో జరిగిందని వాడెవడో అంటే నువ్వెందుకు యిది అవుతావు. మనం మామూలుగా వుందాం, ఆ రొంపిలోనుంచి ముక్తి దొరికింది కదా మరొకలాగా బతుకుదాం. అవసరమయితే యీ రోగాన్నే ఆయుధం చేసుకుని బతుకుదాం అని చెప్పింది. భయపడకు నీభయం నాకు చెప్పి

నన్ను భయపెట్టకు. నేను తీసుకెళ్లే చోటికి రా. యింకా పదేళ్లో పదిహేనేళ్లో బతుకుతాం అని చెప్పాడు కదా భయపడకు అని ధయిర్యం చెప్పింది.

జనరల్ కంపార్ట్‌మెంట్ నిండుగా వుంది. యెదురు సీట్లో ముసిలాడు జోగుతూనే మధ్యమధ్యలో అరకన్నుల మధ్య నుంచి తొంగిచూస్తున్నాడు. కిటికీ లోనుంచి చంద్రుడు చీమలు కొరుక్కుతిన్న రొట్టెముక్కలాగా యెలాగో వున్నాడు. చీకటిలో కదిలిపోతున్న చెట్లూ దూరాలూ చాలా అర్థరహితంగా వున్నాయి. కదులుతోంది బండి కానీ యేమీ కనిపించడం లేదు. లోపల సరస్వతినీ బయట చీకటిని మార్చి మార్చి చూస్తుంటే అంతా అర్థం అవుతున్నట్టే వుంది. సరస్వతి చేయిని గట్టిగా పట్టుకోవాలనిపించింది.

♦